ప్రజాశక్తి

శనివారం 4 జనవరి 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు




## మహిళా ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-కందుకూరు: భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో జనార్ధన కాలనీలోని ఎంపిపి ఎస్ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు జి. రామలక్ష్మమ్మ, ఉపాధ్యాయిని గుర్రం రాధిక, జెడ్.పి.గర్ల్ హైస్కూల్ పి.ఎస్. ఉపాధ్యాయురాలు కొల్లూరి పద్మలను శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతిభా పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ మహిళల విద్య కోసం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, సామాజిక అణచివేతపై వ్యతిరేకంగా పోరాడిన సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ జాయింట్ సెక్రెటరీ జయవరపు కనకమహాలక్ష్మిలు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

# అధికారం ఉంటే చట్టం వీరికి చుట్టమా..!

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో అడ్డగోలు నిర్మాణాలు జరుపుతున్నారు.. అధికారం, రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉన్న కొందరు వ్యక్తులు మున్సిపల్ చట్టాలను ఉల్లంగిస్తున్నారు.. ఎలాంటి అనుమతు ల్లేకుండా ఇష్టానుసారం భవన నిర్మాణాలు చేపడుతున్నారు. వైసిపి ప్రభుత్వం లో కొందరు ప్రజా ప్రతినిధుల బంధువులు, స్నేహితులు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్‌లు, నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం కొనసాగు తున్నాయి. మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ నిర్మాణాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని భవనాలకు నోటీసులు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాలు లెక్కచేయ కుండా నిర్మాణాలు చేపడు తున్న ఏడు అంతస్తుల భవనంలోని మూడు అంతస్తులను శుక్రవారం మున్సిపల్ అధికారులు పోలీసుల సహకారంతో తొలగింపు చారు. ఇంకా కొనసాగుతున్నాయి. మరికొన్ని భవనాలకు నోటీసులు జారీ చేశారు. నేడో, రేపో వాటిని తొలగించడానికి ఆదేశాలు జారీ చేశారు..

- అడ్డగోలు భవన నిర్మాణాలు
- కమిషనర్ ఆగ్రహం..
- నిర్మాణాలు తొలగింపు
- మరికొన్ని భవనాలకు నోటీసులు
- అక్రమార్కుల్లో ఆందోళనలు

భవనాలను పోలీసు సహకారంతో తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కార్పొరేషన్ స్థలాల ఆక్రమణలు, అనధికార బిల్డింగ్ నిర్మాణాలు, జిప్లస్2 కి అనుమతులు తీసుకొని ఆరు, ఏడు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతల అండదండలతో తమను ఎవరు ఏం చేస్తారు అనే ధోరణి ఎక్కువైంది. ఎన్నో ఏళ్లుగా అక్రమాలు జరుగుతున్నాయి. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదు అంతస్తుల వరకు మాత్రమే అనుమతులున్నాయి. వీటికి మాత్రమే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులను జారీ చేస్తారు. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ఏ ప్రభుత్వాలు అయినప్పటికీ అప్పటి రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి మున్సిపల్ అధికారులు మౌనంగా ఉంటున్నారు. నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో ఓ రాజకీయ నేత సమీప బంధువులు, స్నేహితులు అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం డాక్టర్ బంక సురేష్ ఆసుపత్రి పేరుతో జిప్లస్2కి మున్సిపల్ అధికారుల వద్ద భవన నిర్మాణాలకు అనుమతి తీసుకున్నారు. ప్రస్తుతం ఏడు అంతస్తుల భారీ భవనాన్ని నిర్మాణం చేశారు. ఫైర్ అధికారుల అనుమతి ఇచ్చినట్లు రికార్డులు సృష్టించారు. గత ప్రభుత్వంలో అంతా తమవారు కావడంతో చట్టం తన చుట్టం అనుకున్నారు. ఏకంగా ఎలాంటి అనుమతు లేకుండా భారీ భవన నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయి. ఇదే ప్రాంతంలో మరో రెండు భారీ భవ నాలు నిర్మాణాలు జరుగుతు న్నాయి. ఇక్కడే ఆదే తంతు సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నిర్మాణాలకు ఎప్పుడో అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు మౌనం దాల్చారు. మళ్లీ మరదే అధికారం అనుకున్న కొందరు వ్యక్తులు ఎవరి మాట వినలేదు. ఈ ప్రాంతానికి చెందిన మున్సిపల్ అధికారి ధనుం జయరెడ్డి అప్పట్లో ఉన్నతాధికారులకు విషయం చెప్పలేదు. ఆయన ఇటీవల పదవీ విరమణ చేశారు. ఇప్పుడు అసలు విషయం బయటపడింది. ఐదు అంతస్తుల నిర్మాణం జరిగి నెల్లూరులో ఏడు అంతస్తుల నిర్మాణాలు సాగడంతో అనుమానాలు వచ్చాయి. కార్పొరేషన్ పరిధిలో కొందరు జిప్లస్2 అనుమతులు తీసుకొని నాలుగు, ఐదు అంతస్తుల నిర్మాణాలు చేసుకున్నారు. ఏకంగా ఏడు అంతస్తుల నిర్మాణం చేపట్టారు.

జెమ్స్ గార్డెన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం.

**భవన నిర్మాణం కూల్చివేత..!**

మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర చేశారు. ఇటీవల అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతర అధికారులు జెమ్స్ గార్డెన్ ప్రాంతంలో నిర్మాణంలోని డాక్టర్ బంక సురేష్ బిల్డింగ్‌ను చుట్టు ముట్టారు. సిబ్బ సాంబశివరావు వద్ద సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంతస్తులను తొలగించారు. శ్లాబులు రంధ్రాలు కొట్టారు. ఇంకా భవన నిర్మాణాలు ధ్వంసం కొనసాగు తోంది. విషయం తెలిసినా ఏ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధి జోక్యం చేసుకోలేదు. భవన నిర్మాణ యజమానులు ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. అక్రమంగా, అడ్డగోలుగా నిర్మాణం చేయడంతో మౌనంగా ఉండిపోయారు. ఆదే ప్రాంతంలో మరికొన్ని భవనాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. నేడో, రేపో మరికొన్ని భవనాలను తొలగించ చడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చట్టాలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా ఇలాంటి చర్యలే ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్రమార్కుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. చట్టం ఎవరికీ చుట్టం కాదనేది ఈ అంశం లోనైనా గుర్తించాలని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇలాంటి అక్రమాలను ప్రోత్సహించ కూడదని చెప్పకనే చెప్పారు. అక్రమార్కుల భరతం పట్టినా అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తారో లేదో చూడాలి...

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

## కమర్షియల్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజాశక్తి దినపత్రిక 2025 నూతన సంవత్సరానికి సంబంధించిన కమర్షియల్ క్యాలెండర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.సూర్యతేజ ఆవిష్కరించారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో ఈ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి పాఠకులకు ముందుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసమస్యలపై స్పందిస్తూ నిస్పక్షపాతంగా వార్తకథనాలను ప్రచురిస్తూ పత్రికా రంగంలోనే 'ప్రజాశక్తి' మంచి గుర్తింపు పొందిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాకుండా ఉద్యోగ, కార్మిక, కర్షక, వ్యవసాయ ఇలా ప్రతి ఒక్క రంగంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి దినపత్రిక మేనేజర్ కోటేశ్వరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి యం.వి.రమణయ్య, స్టాఫ్ బాలకృష్ణ, సీనియర్ రిపోర్టర్ సి.హెచ్.భువనేశ్వర్ పాల్గొన్నారు.

## ఎపిఇఆర్‌సి ప్రతిపాదనలపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర విద్యుత్ సంస్థలు(ఎపి ఎస్‌పిడిసిఎల్, ఎపి సిపిడిసిఎల్, ఎపి ఎపిఈపిడి సిఎల్) ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై జనవరి 7 నుండి 8 వరకు విజయవాడలో 10వ తేదీ కర్నూలు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. విజయన్ తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రతిరోజు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు షెడ్యూల్ ప్రకారం ఎపిఇఆర్‌సి వారు విచారిస్తారని తెలిపారు.

# సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల 'లోగో' ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు: ఉద్యమాల పురిటి గడ్డగా గుర్తింపు పొందిన ప్రాంతంలో సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు ఫిబ్ర వరి 1,2,3 తేదీల్లో మూ డు రోజుల పాటు జరుగనున్న తరుణంలో ఈ మహాసభల "లోగో"ను సంబంధించిన "లోగో"ను సిపిఎం జిల్లా కమిటీ ఆవిష్కరించింది. శుక్రవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు ఈ మహాసభల 'లోగో' ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఎంతో మంది రాజకీయ మేధావులు జన్మించిన సింహపురి గడ్డపై సిపిఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించుకొనే అవకాశం దక్కడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ మహాసభల్లో గడిచిన మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం చేసిన పోరాటాలు, ఉద్యమాలు, సాధించిన విజయాలపై సుదీర్ఘమైన చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27వ రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలపై గత ప్రభుత్వం మోపిన ఆర్థిక భారాలను ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అమలు చేయడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య విభేదాలు తీసుకొచ్చే దుకు 5వ తేదీ విహెచ్‌పి ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ ప్రజలను కూడగట్టి, ప్రజల్లో మతసామరస్యాన్ని పెంపొందించేసి ఉద్యమాలను ఐక్యతను కూడగట్టేందుకు ఎటువంటి ఉద్యమాలు, పోరాటాలు చేయాలో ఈ మహాసభల్లో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. జిల్లాలో నెలకొంటున్న ప్రజాసమస్యలపై భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్త పోరాటాలు చేసేందుకు ఈ మహాసభలు దిక్సూచిగా నిలుస్తాయన్నారు. అనంతరం మాజీ ఎంఎల్‌సి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఒక ప్రత్యేకమైన సందర్భంలో రాష్ట్ర 27వ మహాసభలు జరుగుతాయని తెలిపారు. శాస్త్రీయంగా ప్రజలందరికీ ఉమ్మడి ప్రయోజనాలను కాపాడేందుకు, సామాజిక న్యాయం వైపు నుంచి జరిగేటటువంటి సమగ్రమైన అభివృద్ధి ఏ రూపంలో ఉండాలనేటటువంటిదానికి ఒక రూపకల్పన చేసేందుకు ఈ మహాసభలు దోహదపడతాయన్నారు. జిల్లా ప్రజలందరూ ఈ మహాసభలను దిగ్విజయం చేసేందుకు తోడ్పాటు నందించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్ రావు, గోగుల శ్రీనివాసులు, కె.అజయ్‌కుమార్, ఎం.పుల్లయ్య, మూలి వెంగయ్య పాల్గొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

## సమిష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి

ప్రజాశక్తి-నెల్లూరు: విద్యుత్ ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే మన సంస్థ అభివృద్ధి చెందుతుందని ఎస్ఈ వి.విజయన్ పేర్కొన్నారు. శుక్రవారం విద్యుత్ భవన్ లోని స్కాడా బిల్డింగ్ లో నెల్లూరు టౌన్ డివిజన్ రూరల్ డివిజన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి సిబ్బంది కష్టపడి పనిచేసి సంస్థకు మంచి పేరు తెచ్చి వినియోగదారులకు సంతృప్తి కర మైన సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి. మురళీ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెల్లూరు రూరల్ ఏ. సోమశేఖర్ రెడ్డి, జూనియర్ ఇంజనీర్స్, పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలోని దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విస్తృత సమావేశం శుక్రవారం జరిగింది. టి రాము అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం వి రాజు మాట్లాడుతూ ఆటో కార్మికులు అనేక సమస్యలతోటి ఇబ్బంది పడుతున్నారని స్థానికంగా ఆటో స్టాండ్స్, ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండటం, పెనాల్టీలు భారంగా మారాయని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే సురేష్ మాట్లాడుతూ డిగ్రీలు చదువుకొని ఉద్యోగాలు లేక అనేకమంది ఆటో రంగంలోకి వస్తున్నారని తెలిపారు.. ఈనెల 21వ తేదీ నెల్లూరు నగరంలో రవాణా రంగా కార్మికుల సదస్సు జరుగుతుందని ఈ సదస్సులో ఆటోడ్రైవర్లు నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సుకి కందుకూరు పట్టణం నుండి ఆటో కార్మికులు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం 11 మంది తోటి కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఎస్ ఎ గౌస్, కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష కార్యదర్శులుగా ఎం నరసింహ, టి రమేష్, కోశాధికారిగా ఎం చెంచురామయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్ కె బాజీ, కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా బి ప్రతాప్, డి మహేష్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో బి శివ, కె అంకయ్య, అనిల్, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు గౌస్

## పారిశ్రామిక హబ్‌గా కందుకూరు నియోజకవర్గం

ప్రజాశక్తి-కందుకూరు

సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ కందుకూరు నియోజకవర్గం లోని రామాయపట్నం వద్ద బీపీసీఎల్ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. దాదాపు 6000 ఎకరాలు అందించేందుకు అంగీకారం తెలిపింది .96 వేల కోట్లతో పెట్టుబడితో ఏర్పాటు కానున్న బీపీసీఎల్ కంపెనీ దీని ద్వారా వేలాదిమంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు కేబినెట్ నిర్ణయంపై ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలం రామాయపట్నం సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బిపిసిఎల్) రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటులో మరో కీలక ముందడుగు పడింది. రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. తానుసంకల్పించినట్లుగానే ప్రాతినిధ్యం వహిస్తున్న కందుకూరు నియోజకవర్గంలో తన హయాంలో ఇంత భారీ పరిశ్రమ ఏర్పాటు కావడం చాలా గర్వకారణంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు, యువ నాయకులు నారా లోకేష్‌కు, కందుకూరు నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సిఎం చంద్రబాబు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్‌ఎ ఇంటూరి

## కమిషనర్‌ను కలిసిన కందుకూరు సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు: కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఐ.ఎ.ఎస్. నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ ఐ.ఏ.ఎస్.ను శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## విధులపట్ల అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రాథమిక, పట్టణ, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.సుజాత సిబ్బందికి సూచనలు చేశారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక, పట్టణ, సామాజిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్స్‌కి మాసాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వి. సుజాత, జిల్లా క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ ఎస్.కె ఖాదర్ వలీ, జిల్లా మలేరియా అధికారి ఈ. హుస్సేనమ్మల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ డాక్టర్ వి. సుజాత మాట్లాడుతూ అందరూ సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ ఎస్ ఒక్ ఎస్ హాజరు సకాలంలో నమోదు చేయవలెనన్నారు. సమయపాలన కచ్చితంగా పాటించి విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం డాక్టర్ ఎస్. కె ఖాదర్ వలీ మాట్లాడుతూ క్షయ వ్యాధికి సంబంధించిన గళ్ల పరీక్షలు వారి ప్రమాణాలతో నిర్దేశించిన నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన 1వలిటరాల యాప్ లో పొందుపరచాలన్నారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ మలేరియా యాక్టివ్, పాసివ్ రక్త పరీక్షల నమూనాలను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం 100 శాతం పూర్తి చేయాలన్నారు. వారాంతపు, మాసాంతపు రిపోర్టులను సకాలంలో జిల్లా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా గణాంక అధికారి సహన, మలేరియా అధికారి వి నాగార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ సుజాత

## శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలో ప్రముఖ వివిన్ జ్యూవెలరీ షాప్ యజమాని వేముల సుకుమార్ గుప్తా తన మంచి హృదయాన్ని మరోసారి చాటుకున్నారు. తన మంచి మనసుతో ఎన్నో మంచి కార్యక్రమాలకి అక్షలాది రూపాయలు విరాళంగా అందజేసే సుకుమార్ గుప్తా శుక్రవారం పోతురాజు మిట్ట దగ్గరలో ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ 4,11,116లు విరాళం అందజేసి తన మంచి మనసుని మరోసారి నిరూపించుకున్నారు. భారీ విరాళాన్ని అందజేసిన వివిన్ సుకుమార్ గుప్తాను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో సుకుమార్ గుప్తా కుటుంబ సభ్యులు తిరుమలరావు, పార్ధు, ఆర్యవైశ్య నాయకులు మురారి శెట్టి సుధీర్ కుమార్, గుర్రం అల్లూరయ్య బొగ్గవరపు బాల నరసింహ పాల్గొన్నారు.

## సమన్వయంతో విధులు నిర్వహించండి

ప్రజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల్లో విధుల నిర్వహణలో అన్ని విభాగాల కార్య దర్శులు సమన్వయంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక 52/1 జనక దొంక, 52/2 గోపురం వీధి సచివాలయాలను కమిషనర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రిజిస్టర్ లను తనిఖీ చేసి క్రమం తప్పకుండా రిజిస్టర్లలో వివరాలను ప్రతి ఒక్క కార్యదర్శి నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యదర్శులతో కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని టిడ్కో లబ్ధిదారులను గృహ ప్రవేశాలు జరిపేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శానిటరీ, ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వమని కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును కమిషనర్ తనిఖీ చేసి నీటి నాణ్యతను, సరఫరాను పరిశీలించారు. సమీపంలో అనధికారికంగా నిర్మించిన రేకుల షెడ్డును గమనించి తొలగించమని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

మాట్లాడుతున్న కమిషనర్

## విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: పేద విద్యార్థుల విద్యాభివృద్ధిలో ప్రముఖ పాత్రకామిక వే త్త, విద్యాదాత నాయుడు ఆదిశేషులు రెడ్డి చేస్తున్న విశి ష్ట కృషి అభినందనీయమని సర్వేపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొ న్నారు. శుక్రవారం సర్వేపల్లి జిల్లా ప రిషత్ హై స్కూల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త క్రీడాకేటలు నాయుడు దశరథరామిరెడ్డి 26వ వర్ధంతి వేడుకలు ఆ త్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రమోహన్ రెడ్డి హాజరయ్యారు.

## మోపాడులో పొలంబడి

ప్రజాశక్తి-కందుకూరు: మండలం మోపాడు గ్రామంలో గ్యాప్ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్) పొలంబడి మండల వ్యవసాయాధికారి వి. రాము ఆధ్వర్యంలో జరిగింది. ఏ రాము మాట్లాడుతూ పొలం బడిలో రైతులకు సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి రైతులకు మంచి నాణ్యమైన అధిక దిగుబడులు పొందుటకు సలహాలు సూచనలు ఇవ్వటమే దీని ఉద్దేశం అని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ. రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

## నేడు మధ్యాహ్న భోజనం ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు: 2025 వ సంవత్సరం జనవరి 4వ తేదీ నుంచి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఇంటర్ విద్యార్థిని విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కందుకూరులోని టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్నట్టు ప్రిన్సిపల్ నాగూర్ వలి తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఈనెల 4 శనివారం నుండి ప్రారంభిస్తారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని ఆహ్వాని ంచారు. విశిష్ట అతిథులుగా కందుకూరు సబ్ కలెక్టర్ కుమారి తిరుమని శ్రీ పూజ, కందుకూరు తహశీల్దార్ సయ్యద్ జక్రుల్ ,కందుకూరు మున్సిపల్ కమిషనర్ కె.అనూష పాల్గొంటారు.

పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ ఇంటూరి

## విజయలక్ష్మికి నివాళులు

ప్రజాశక్తి-లింగసముద్రం: మండలంలోని ముత్యాలపాడు తెలుగుదేశం పార్టీ నాయకుడు కాట్రగడ్డ వెంకటప్ప నాయుడు భార్య విజయలక్ష్మి మృతిచెందారు. శుక్రవారం కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముత్యాలపాడు లోని వెంకటప్ప నాయుడు ఇంటికి వెళ్లి విజయలక్ష్మి భౌతికా యానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మండలంలోని పలువురు నాయకులు వెంకటప్ప నాయుడుని పరామర్శించారు.

# ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇంజ నీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ జీతాలు అందజేసే విధానం అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులు, ఉద్యోగులు నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నగర మేయర్ పోట్లూరి స్రవంతికి వినతి పత్రం సమర్పించి సమస్యలు వివరించారు. స్పందించిన నగర మేయర్ హెల్త్ ఆఫీసర్, సూపరింటెండింగ్ ఇంజినీర్లకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మిగతా సమస్యలు పరిష్కరించేందు కు తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె.పెంచలనర సయ్య, యూనియన్ నగర కార్యదర్శి జి.నాగేశ్వర రావు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగపు కార్యదర్శి మట్టిపాటి శ్రీనివాసులు మాట్లాడారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు అతి తక్కువ వేతనాలు అమలు అవుతున్నాయన్నారు. గత సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ విభాగపు కార్మికులకు స్కిల్డ్ సెమీ స్కిల్డ్ జీతాలు అమలు చేస్తామని, గత ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. అవి అమలు చేయటంలో భాగంగా ఆర్థిక శాఖకు పంపిన ఫైళ్లను కూటమి ప్రభుత్వం వెనక్కి తెప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం లో చేసిన ఒప్పందాన్ని ప్రభుత్వాన్ని పార్టీలకతీతంగా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలు కార్మికులకు అమలు చేయాలన్నారు. నగర పాలక సంస్థలో చిన్న సమస్యలు సైతం అమలు కావడం లేదన్నారు. బ్యాంకు రుణాలు, ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ లాంటి సమస్యలు అనేక దఫాలు తెలియజేసినా ఫలితం లేకుండా ఉందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి తక్షణమే సమస్యలు పరిష్కారం పై దృష్టి సారించాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు దశలవారీగా పోరాటం కొనసాగు తుందని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీవీ నరసింహ, యూనియన్ నాయకులు లోకేష్, సునీల్, మహేష్, భాగ్యమ్మ, కొండమ్మ, కామాక్షమ్మ బాలు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

# సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి- నెల్లూరు: విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని స్టోన్ హౌస్ పేటలోని ఆర్ ఎస్ ఆర్ మున్సిపల్ హైస్కూల్ జిల్లాస్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను డిఇఒ బాలాజీరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం అరుణమ్మ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిశోధనలతోనే భారతదేశ అభివృద్ధి సాధ్యమని, ఆగ్రదేశాల సరసన భారత్ ముందంజ నిలిచేందుకు సైన్సు పరిశోధనలే కీలకంగా ఆమె చెప్పారు. నేడు మానవజాతి అనుభవిస్తున్న ఆధునిక సౌకర్యాలన్నీ విజ్ఞాన శాస్త్ర ఫలాలే అని సైన్సు గొప్పతనాన్ని వివరించారు. కార్యక్ర మంలో సమగ్ర శిక్ష ఏపిసి వెంకట సుబ్బయ్య, జిల్లా సైన్సు సెంటర్ ఇన్ ఛార్జి కరుణాకర్ రెడ్డి, హెచ్ఎం మధు సూదన్, విక్రమ సింహపురి యూనివర్సిటీ అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, గోవిందరాజులు, స్థానిక కార్పొరేటర్ కామాక్షి దేవి, ఎంఇఒలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: పంచాయతీ నిధుల దుర్వినియోగం కుంభకోణంలో ఇద్దరు సెక్రటరీలు సస్పెన్షన్ కు గురైన విషయం తెలిసిందే. ఇదే కుంభ కోణంలో ప్రభుత్వం తాజాగా సర్పంచ్ మోచర్ల వజ్రమ్మ చెక్ పవర్‌ను రద్దు చేసింది. వివరాల్లోకి వెళితే...వైసీపీ ప్రభుత్వ పాలనలో మండలం, కృష్ణపట్నం పంచాయతీలో దాదాపు 6 కోట్ల నిధులు గోల్‌మాల్ అయ్యాయి. దాంతో "కృష్ణపట్నంలో వైసీపీ నేత చేతివాటం..రూ. కోట్లు అభివృద్ధి నిధులు మాయం " అనే శీర్షికతో 2024 అక్టోబర్ నెల 14వ తేదీన "ప్రజా శక్తి" దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఆనంద్ చేప ట్టిన విచారణలో కృష్ణపట్నం పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారణ అయింది. వజ్రమ్మను కూడా బాధ్యు రాలిని చేస్తూ ఆమె చెక్ పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం ముత్తుకూరు ఎంపిడిఒ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మూడు నెలలు చెక్ పవర్ ను ముత్తుకూరు ఈఓపిఆర్ అండ్ ఆర్డికి ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట** : గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రూ.5లక్షల మేర జరిమానా విధిస్తామని ఇందుకూరుపేట ఎక్సైజ్ సిఐ జివి ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఇందుకూరుపేట మండలంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఆయన శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జి వి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ముత్తుకూరు, తోటపల్లి గూడూరు, ఇందుకూరుపేట మండలాలోని 18మద్యం దుకాణాలలో ఎంఆర్‌పికి మించి అధిక రేట్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం దుకాణదారులు ఎంఆర్‌పికి మించి రేట్లు అమ్మితే కట్టిన ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి మద్యంషాపు వద్ద ఎంఆర్‌పి ధరల ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికరెట్లకు అమ్మితే ఫ్లెక్సీ బోర్డులో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్లకు తెలియచేయాలన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్ట్‌షాప్ నిర్వహకులు, మద్యం దుకాణదారులు ఇద్దరూ ఇందుకు మూల్యం భారీగా చెల్లించాలని హెచ్చరించారు. ఇప్పటి వరకు 25 కేసులు 200 పైగా మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు ఆయన తెలియజేశారు.

## వసతి గృహాలలో తనిఖీ

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర, బాలికల వసతి గృహాలను వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాలలో బాలబాలికలకు కల్పిస్తున్న వసతి సదుపాయాలను వార్డెన్‌లను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌లను ఆదేశించారు. బాలుర వసతి గృహంలోని విద్యార్థులతో స్టడీ ప్రోగ్రెస్ గురించి తెలుసుకొని పరీక్ష ఫలితాలలో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి స్టడీ సమయంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాస్టల్‌లో భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట వార్డెన్‌లు అలీ, సూర్యకుమారి ఉన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరించాలి

**ప్రజాశక్తి-బిట్రగుంట** : శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో వెలసి ఉన్న బీలకూట క్షేత్ర శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి ప్రదక్షణ, ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కోనేరు, అన్నదాన సత్రం ఆలయ గాలిగోపురం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి లక్కాకుల మాధవరావు, సీనియర్ నాయకులు ఎల్.సుధీర్ బాబు, చిలకపాటి వెంకటేశ్వర్లు, కాంట్రా రఘురాం నాయుడు, విజయ్‌యాదవ్, రామ్మోహన్ రెడ్డి, సంజయ్, సుభాని, వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఐ బొజ్జ, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : మండల పరిధిలోని గండిపాలెంలో రెవెన్యూ సదస్సులో 7 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో పాల్గొని వివిధ సమస్యలతో రెవెన్యూ సదస్సులో గ్రామస్తుల నుండి 7 అర్జీలు స్వీకరించామన్నారు. పాస్‌పుస్తకాల మోటేషన్ కోసం ఎక్కువ అర్జీలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు ముగిశాయన్నారు. సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తమ సిబ్బందితో తమవంతు కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, విఆర్ఓ బిల్లుపాటి వెంకటేశ్వర్లు, యువ నాయకులు సాయి, స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-దుత్తలూరు** : మండల పరిధిలోని తెడ్డుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ వై.నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఉన్న 17 పంచాయతీల్లో షెడ్యూల్ ప్రకారం ఈరోజుతో గ్రామ రెవెన్యూ సదస్సులు ముగిశాయన్నారు. దాదాపు డిసెంబర్ 6వ తేదీ నుంచి దుత్తలూరు మండలంలోని పంచాయతీల్లో భూ రీసర్వే సదస్సు కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో భాగంగా, మొత్తం మీద అన్ని పంచాయతీల్లో 156 అర్జీలు వచ్చాయన్నారు. అందులో 30 అర్జీలను పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన 126 అర్జీలను కూడా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సదస్సులో సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, టిడిపి సీనియర్ నాయకులు రెవెన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, రైతులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కోవూరు** : కోవూరు పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలలో భూముల రీ సర్వే జరుగుతుందని, దానిని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సుతో పాటు రీసర్వే గ్రామసభ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.విజయ, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ రెవెన్యూ అధికారులున్నారు.

## జొన్నవాడకు ప్రత్యేక బస్సు

**ప్రజాశక్తి-కావలి** : జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి సన్నిధికి బస్సును పున:ప్రారంభం పేద భక్తులకు సంతోషాదాయకమని, అమ్మవారి భక్తురాలు బుడంగుంట శ్రీశ్రీశ్రీ కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి దేవస్థాన నిర్మాణకర్త ద్రోణాదుల లక్ష్మీ సంపూర్ణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో జొన్నవాడ బస్సును ద్రోణాదుల లక్ష్మీ సంపూర్ణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కల్యాణ్, అసిస్టెంట్ మేనేజర్ (కార్యాలయం) విజయ కుమారి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, బస్టేషన్ మేనేజర్ రమేష్ బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, సెక్యూరిటీ అధికారి కెకె రావు, బిసి ఐక్యత భవన్ అధ్యక్ష కార్యదర్శులు అట్లంకి ప్రభాకర్, చిన్ని వరప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

**ప్రజాశక్తి-కోవూరు** : 2019 నుండి ఇప్పటి తెలుగుదేశం నాయకులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్లను అభివృద్ధి చేశారని పేదలకు ప్రభుత్వ హాస్పిటల్లలో మెరుగైన వైద్యం అందించారని టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2019 నుంచి 2024 మధ్యలో వైసిపి పాలనలో ఆరోగ్యశ్రీ శాఖా మారింది, ప్రభుత్వ వైద్యం పేదోడికి దూరమైందని గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో వైద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి 7నెలలు అయినా ఇంకా వైద్యుల పనితీరులో మార్పు రాలేదని కొంతమంది బాగానే పని చేస్తున్నప్పటికీ ఎక్కువమంది వైద్యులు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ వైద్యం పేదోడికి దగ్గరయ్యేలా చర్యలు తీసుకోవాలని చేస్తున్నామన్నారు.

## కామాక్షితాయి సేవలో 'కరుణామయి'

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం** : పెంచలకోన క్షేత్రంలో ఉన్న కరుణామయి విజయేశ్వరి దేవి అమ్మవారితో పాటు మరో 50మంది విదేశీ భక్తులు జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి ఆర్య భూమి శ్రీనివాసులు రెడ్డి ఆలయ మర్యాదలతో అతిథులకు స్వాగత ఏర్పాట్లు చేయించి దర్శనాలు కల్పించారు. ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## తహశీల్దారు, ఎస్ఐలకు సత్కారం

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : మండల పరిధిలోని స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలోని తహశీల్దార్ శ్రీరామకృష్ణ, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి సైదులుకు, మండల అధికారులకు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు ఎంఆర్‌పిఎస్ జిల్లా సీనియర్ నాయకులు గంగిపుట లక్ష్మయ్య మాదిగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ముఖ్యంగా ఎంఆర్‌పిఎస్ మాదిగ జాతి బిడ్డలకు ప్రత్యేకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎల్ఎకు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-వింజమూరు** : ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ను వింజమూరు ఆటోమొబైల్ డీలర్స్ మెకానిక్ వర్క్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంకినపల్లి రఘురామిరెడ్డి సెక్రటరీ గువ్వల రవిచంద్రారెడ్డి కార్యదర్శులు కదిరి రంగారావు, మహేంద్ర బ్రెడ్ బ్రహ్మయ్య తదితరులు టిడిపి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వింజమూరు పట్టణానికి ఆటోనగర్ అవసరమని ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలియజేశారు.

# పూర్తికాని వెలుగొండ ప్రాజెక్ట్..

- అవస్థలు పడుతున్న మెట్టప్రాంత ప్రజలు

**ప్రజాశక్తి-వరికుంటపాడు**

మెట్ట ప్రాంత అభివృద్ధి కోసం 2004వ సంవత్సరంలో మొదలు పెట్టిన వెలుగొండ ప్రాజెక్ట్ 2024 పూర్తైనా ప్రాజెక్ట్ పూర్తికాలేదు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలలో పాటు మెట్టప్రాంతాలను అభివృద్ధి వైపు నడిపించాలంటే ఆయా ప్రాంతాల్లో పుష్కలంగా సాగునీటి వనరులు అందుబాటులోకి తీసుకురావాలని 2004లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగానే జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును నియోజకవర్గ పరిధిలోని వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లిలో రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. వెంటనే టెండర్లు వేయగా ఎంఆర్‌కెఆర్ కంపెనీ వారు రూ.1100 కోట్లకు టెండర్ దక్కించుకున్నారు. ఈ ప్రాజెక్టును సత్వరమే ప్రారంభించాలని 2004లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పటి నుండి 2009 వరకు శరవేగంగా పనులు సాగాయి. ఆయన మరణానంతరం పనులు నత్తనడక తలపించాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట కొంతమేర పనులు పూర్తి కాగా, మరికొంత మేర (68 శాతం) ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టును రెండు టి.ఎం.సి.ల నీటినిల్వ సామర్థ్యంతో, 1650 మీటర్ల పొడవుతో, 32మీటర్ల ఎత్తులో నిర్మాణం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు శ్రీశైలం ప్రాజెక్టు ఎగువ భాగాన మిగులు జలాలను నల్లమల, సాగర్ నుండి 139 కిలోమీటర్ల పొడవుతో తవ్విన కాల్వ ద్వారా నీరు వస్తుంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎగువ భాగాన కొల్లాం ప్రాంతంలో హెడ్ రెగ్యులేటర్ నుంచి రెండు సొరంగాల ద్వారా నల్లమల, సాగర్ రిజర్వాయర్‌లో నిల్వ చేసి, అక్కడ నుండి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4,47,300 ఎకరాలకు సాగునీరు, 15.25లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఈ రిజర్వాయర్ నుండి 3.98 కిలోమీటర్ల మేర ఉప కాలువ తవ్వి, తద్వారా గండిపాలెం ప్రాజెక్టుకు నీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు మండలాలకు సాగు, తాగునీరు అందుతుంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

వెలుగొండ రిజర్వాయర్

# న్యాయవాదులు విధులు బహిష్కరణ

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై సిట్టింగ్ జడ్జీతో న్యాయవిచారణ జరిపించి, ఆయన మృతికి కారణమైన అనంతపురం త్రీ టౌన్ సిఐ శాంతిలాల్‌ను వెంటనే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలని ఆత్మకూరు న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి సిఐ శాంతిలాల్ చర్యకు వ్యతిరేకంగా కోర్టు గేటు ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్.సిరాజుద్దీన్, న్యాయవాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక సివిల్ కేసు విషయంలో న్యాయవాది శేషాద్రిని శనివారం రోజున అనంతపురం త్రీటౌన్ సిఐ శాంతిలాల్ స్టేషన్‌కు పిలిపించి దండించినందుకు తీవ్ర మనస్థాపానికి గురైన శేషాద్రి సిఐ ఛాంబర్లోనే గుండెపోటుకు గురై చనిపోయాడన్నారు. శేషాద్రి వెంట వెళ్లిన జూనియర్ న్యాయవాదులను పోలీస్ స్టేషన్లోకి అనుమతించకపోవడం శోచనీయమన్నారు. సివిల్ కేసులో జోక్యం చేసుకోవద్దంటూ సుప్రీంకోర్టు పదేపదే చెబుతున్నా.. సిఐ ఖాతరు చేయకపోవడం దారుణమన్నారు. న్యాయవాది మృతికి బాధ్యత వహిస్తూ ప్రభుత్వం వెంటనే వారి కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలానే అడ్వకేట్ సురేష్ మాట్లాడుతూ శేషాద్రి మృతిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ప్రభుత్వం వెంటనే విచారణకు ఆదేశించి భాద్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనంతపురం న్యాయవాదులు ఉద్యమానికి మద్దతుగా కోర్టు విధుల బహిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కెవి శేషారెడ్డి, ఎల్‌వి రమణయ్య, నంద ఓబులేసు, హరికృష్ణ, తిరుపతమ్మ, రహంతున్నీసా, సురేష్, మల్లికార్జున, రసూల్ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

## అగ్రిమెంట్ ఒకరికి.. రిజిస్ట్రేషన్ మరొకరికి..

- అన్యాయమంటూ బాధితుల ఆవేదన

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

స్థలానికి సంబంధించిన అగ్రిమెంట్ ఒకరితో చేసుకుని, రిజిస్ట్రేషన్ మాత్రం వేరొకరితో చేసుకున్న ఘటన ఇందుకూరుపేట మండలంలోని లేబూరులో చోటు చేసుకుంది. బాధితురాలు బెవర లక్ష్మి వివరాల మేరకు.. 20 సంవత్సరాల క్రితం బతుకుదెరువు నిమిత్తం లెబూరు గ్రామానికి వచ్చాము. కూలి పనులు చేసుకునే తాను, రెండు సంవత్సరాలు క్రితం స్థానికంగా ఉండే కరుణాకర్ రెడ్డి వద్ద తన కష్టార్జితాన్ని చీటీలుగా వేశాను. చీటీ డబ్బులు రూ.4లక్షల మేర కరుణాకర్ రెడ్డి ఇవ్వకుండా ఊరు నుంచి పరారయ్యాడు. అయితే స్థానికుల సాయంతో అతనిని పట్టుకుని నిలదీయగా కరుణాకర్ రెడ్డి తన ఇంటిని లక్ష్మికి అగ్రిమెంట్ చేసి రాసిచ్చాడని గానీ, అందుకు తగిన రొక్కం లక్ష్మీ చెల్లించిందని గానీ, ఎవరితో అనలేదన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల తనకు కూడా తెలియకుండా వేరే వాళ్లకు ఆ ఇంటిని అమ్మినట్లు తెలిసిందని వాపోయింది. తనకు అమ్మిన ఇంటిని మళ్లీ వేరొకరికి ఎలా అమ్ముతారని కరుణాకర్ రెడ్డి ఇంటి ముందు సిపిఎం నేతలతో కలిసి నిరసన తెలిపానన్నారు. అనంతరం సిపిఎం నేత కోటేశ్వరావు మాట్లాడుతూ బాధితురాలికి అండగా పార్టీ ఉందని, ఆమెకు న్యాయం జరిగేంత వరకూ పోరాడుతామన్నారు. సదరూ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే విధంగా అధికారులతో చర్చిస్తామని తెలియజేశారు.

## పాఠశాలలో తనిఖీ

**ప్రజాశక్తి-సంగం** : మండలంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్.ఖాజా మొహిద్దీన్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రార్థన సమయానికి హాజరై విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, టిఐఎస్ పెండింగ్ ఉన్న ఉపాధ్యాయులు వెంటనే పూర్తి చేయాలని, పాఠశాలలో పాఠశాలల యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఉపాధ్యాయులు సాంకేతిక విద్యలో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండి విద్యార్థులకు పాఠాలు బోధించాలని తెలియజేశారు. ప్రతిరోజు యాప్ ద్వారా విద్యార్థుల అటెండెన్స్ సకాలంలో నమోదు చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థుల వర్క్‌బుక్స్, సిలబస్, రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులునారు.

## ఫొటో స్టూడియో యూనియన్ ఎన్నిక

**ప్రజాశక్తి-ఉదయగిరి**

పట్టణంలోని ఫొటో స్టూడియో యూనియన్ కొత్త కార్యవర్గానికి సబంధించి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా రెండోసారి యూనియన్ ప్రెసిడెంట్‌గా ఓంకారం వెంకటప్రసాద్ ఎన్నికయ్యారని యూనియన్ సభ్యులు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించుకుని స్టూడియోల పనితీరును మెరుగుపరుస్తామని, పట్టణంలోని అన్ని స్టూడియోల్లో ఒకే ధరలను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలిపారు. యూనియన్ సభ్యులకు ఆయన కతజ్ఞతలు తెలిపారు ఫొటో స్టూడియో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నారాయణ రెడ్డి, ట్రెజరర్ పవన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ అశోక్, సభ్యులు పవన్, ఆర్.కె.రఫీ, జిలాని, రమేష్, నాగేంద్ర, గౌరవ అధ్యక్షులు నారాయణ, కృష్ణమూర్తి, మిక్సింగ్ రఫీ, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు.

# ప్రభుత్వ భవనాలు వినియోగిస్తే చర్యలు

**ప్రజాశక్తి ఇందుకూరుపేట**

ప్రభుత్వ భవనాలను, స్థలాలను ప్రయివేట్ వ్యక్తులు ఉపయోగిస్తే చర్యలు తప్పవని ఎంఇఒ ఎస్‌వి నాయక్ తెలిపారు. ఇందుకూరుపేట పరిధిలోని రావూరు డొంక ప్రభుత్వ పాఠశాల బర్రెలకు ఆవాసంగా మారిందని, కొన్ని వార్తలు రావడంతో ఆయన శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు లేకపోవడంతో రెండు సంవత్సరాలుగా ఈ పాఠశాల మూతపడిందని, దాంతో కొందరు వ్యక్తులు బర్రెలను కట్టేస్తున్నారని తెలియడంతో పాఠశాలను సందర్శించామన్నారు. గత ఎన్నికల్లో ఈ పాఠశాలను పోలింగ్ బూత్‌లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రాథమిక పాఠశాలలో పశువులను కట్టేసిన వ్యక్తిని మందలించి ఇకపై ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్థానికలతో మాట్లాడి స్కూలును ఎవరైనా సొంత కార్యక్రమాలకు ఉపయోగిస్తే తమ దృష్టికి తెలియజేయాలని తెలిపారు. రావూరు డొంకవాసులు గత పది రోజుల క్రితమే తమ పిల్లల చదువు కోసం స్కూల్‌ను ప్రారంభించి తమ పిల్లల చదువు కోసం టీచర్‌ను నియమించాలని అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. దానిపై మండల అభివృద్ధి అధికారి నాగేంద్ర బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కానీ ప్రభుత్వ ఆస్తులు కానీ ఆక్రమణకు గురై దుర్వినియోగంగా గానీ ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ఎస్‌వి నాయక్

## ఎస్ఇ డైరీలు ఆవిష్కరణ

**ప్రజాశక్తి-ఉదయగిరి**

డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

ఉదయ గిరి నియోజకవర్గ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ డైరీలను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శాసనసభ్యులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నియోజకవర్గ ఇంజనీరింగ్ సహాయక నాయకులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ సహాయకులను రేషనలైజేషన్ చేయాలని కోరారు. గ్రామ సచివాలయంలో కీలక పోస్టు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను తమతో మాతృ శాఖలో విలీనం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 8 మండలాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-విడవలూరు** : మండల పరిధిలోని ఎస్ఇ డైరీ ఆవిష్కరణను శుక్రవారం ఎంపిడిఒ నగేష్ కుమారి చేతుల మీదుగా మండల పరిధిలోని వివిధ సచివాలయంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ సంఘం తరపున మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో మధ్యలో ఆగివున్న ప్రభుత్వ నిర్మాణాలను గుర్తించి తెలియపరిస్తే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల అసోసియేషన్ టీం, మండల పిఆర్ ఎఇ శ్యామ్‌సుందర్ రెడ్డి, హౌసింగ్ ఎఇ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**



ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని వ్యాధి రాకముందే నివారించుకోవాలని న్యూరాలజిస్ట్ డాక్టర్ అభినయా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ప్రజా వైద్యశాలలో తలనొప్పికి సంబంధించిన అంశంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. డాక్టర్ అభినయా రెడ్డి మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తర్వాత మందులు వాడి నయం చేసుకోవడం కన్నా వ్యాధి రాకముందే నివారించుకోగల మని ఆమె తెలిపారు. తలనొప్పి ప్రతి ఒక్కరికీ బాధించి ఉంటుందని, తలనొప్పి రెండు విధాలుగా ఉంటుందని ప్రమాద భరితమైన తలనొప్పి ముందుగానే గుర్తించి ప్రాథమిక దశలోన నిర్మారించుకోగలమన్నారు. శ్రీ వెంకటేశ్వర వైద్యశాల అధినేత డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన 35ఏళ్ల డాక్టర్ జీవితంలో గ్రామీణ ప్రజలకు తగ్గట్టు వివరించి వైద్యం చేస్తున్నానని తెలిపారు. అలాంటి గ్రామీణ ప్రాంత ప్రజలకు యూరాలజిస్ట్ డాక్టర్ అభినయా రెడ్డికి సాధ్యపడుతుందన్నారు. ప్రతినెలా మొదటి శుక్రవారం డాక్టర్ అభినయ రెడ్డి వెంకటేశ్వర వైద్యశాలలో అందుబాటులో ఉంటారని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సర్వీస్ ప్రొవైడర్ల ఎంపికకు దరఖాస్తులు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో వివిధ రకాల సేవలు అందించే సర్వీస్ ప్రొవైడర్ల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ టౌన్ మిషన్ కోఆర్డినేటర్ మాధవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రిషియన్, ఏసీ, గ్రీసర్, టివి, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ మరమ్మతులు, బ్యూటీషియన్, బార్బర్ తదితర సేవలు అందించే వారి నుండి దరఖాస్తుల సేకరణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, ఎన్ఎస్‌డిసి, ఎస్‌డిసి, ఎన్ఎసిల ద్వారా సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోం ట్రయాంగిల్ ఆన్ లైన్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌బోర్డు చేసి జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు శనివారం సాయంత్రం 4 గంటల్లోగా మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మా నిర్వహించడం జరుగుతుందని, అర్హత కల వారు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, విద్యార్హత సర్టిఫికేట్ జెరాక్స్‌లతో పాట రెండు ఫొటోలు తీసుకుని హాజరు కావాలని, వివరాలకు 7901311599 సంప్రదించాలని కోరారు.

## ప్రేరణ తరగతులను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి**

ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం 4న గండిపాలెం, వెంగల్ రావు నగర్ జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు గండిపాలెం గురుకుల పాఠశాలలో ప్రేరణ తరగతులు జరుగుతాయన్నారు. అలాగే మధ్యాహ్నం బిజ్జంపల్లి, గడ్డంవారిపల్లి, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉదయగిరిలో ప్రేరణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ఆయా ఉపాధ్యాయులు విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

## బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

**ప్రజాశక్తి-కావలి**

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి ఎస్‌పిడిసిఎల్) 2015-26 సంవత్సరానికి గానూ సమర్పించిన విద్యుత్ సంస్థల ప్రతిపాదనలపై 7,8,10 తేదీల్లో ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపి ఇఆర్‌సి) బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు శుక్రవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె ఎస్ బెనర్జీ ప్రకటనలో తెలిపారు. 7, 8 తేదీల్లో విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్ సెంటర్‌లోనూ, 10వ తేదీన కర్నూల్‌లోని ఎపిఇఆర్‌సి కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఎపిఇఆర్‌సి చైర్మన్ చైర్మన్ (ఇన్‌ఛార్జి) ఠాకూర్ రాంసింగ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో అభ్యంతరదాలు సమీపంలో విద్యుత్ డివిజన్ కార్యాలయాల నుంచి వారివారి సూచనలు, అభిప్రాయాలు, సలహాలు ఇవ్వాలన్నారు. టారిఫ్ ప్రతిపాదనలపై అభిప్రాయాలను తెలియజేసేవారు ముందుగా కావలి డివిజన్ కమర్షియల్ ఎఇకి అర్జీని సమర్పించాలన్నారు. అప్పుడు వారు ఏ సమయంలో కార్యాలయానికి రావాలనేది ఫోన్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపుతారని తెలిపారు. లేని పక్షంలో ఎపిఇఆర్‌సి వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చన్నారు.

## ఎంఎల్ఎ 'కాకర్ల'కు ఆహ్వానం

**ప్రజాశక్తి - ఉదయగిరి**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఉదయగిరి ఎఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ను కళాశాల ప్రిన్సిపల్ మధు కిరణ్, ఆయన అధ్యాపక బృందంతో కలిసి ఆహ్వానించారు.

## 'కాకర్ల'కు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-కలిగిరి**

కలిగిరి మండల జనసేన అధ్యక్షులు ఉదయగిరి నియోజకవర్గ ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం కలిగిరి మండల జనసేన అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ వింజమూరు మండల జనసేన సీనియర్ నాయకులు కమతం శ్రీనివాసులు కలిగిరి సీనియర్ నాయకులు కోసూరు సురేష్, కలిగిరి జనసేన నాయకులు పాలిశెట్టి మాన్య నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# పలుచోట్ల సావిత్రిబాయిపూలే జయంతోత్సవాలు

నెల్లూరు ఐద్వా నాయకులు

**ప్రజాశక్తి-నెల్లూరు** : మహిళలకు స్వేచ్ఛా, సమానత్వానికి చిహ్నం సావిత్రిబాయి పూలే అని ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ మహిళ స్వేచ్ఛకు సమానత్వానికి చిహ్నం సావిత్రి బాయిపూలే అని, ఉపాధ్యాయులకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షురాలు ఎన్‌వి సుబ్బమ్మ, సంపూర్ణమ్మ, రేహనుమా, వాణి, తదితరులు పాల్గొన్నారు.

**కెవిపిఎస్ ఆధ్వర్యంలో...** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భం గా కెవిపిఎస్‌జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య, ఆలూరు తిరుపాలు, నాయకులు అల్లాడి గోపాల్, దారా శివయ్య, పాదర్తి సురేష్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-నెల్లూరు** : కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు విద్యార్థులతో కలిసి సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడారు.



**ప్రజాశక్తి-ఉదయగిరి** : మండల పరిధిలోని బిజ్జంపల్లిలో జ్యోతిరావు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొదటిగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అవాజ్ కమిటీ సభ్యులు షేక్.నాయబ్ రసూల్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులుగా సావిత్రిబాయి పూలే మహిళా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు అన్వర్, ఫరీద్, బాషా, బాలకృష్ణ, ఫరీద్, నారాయణ, ఇండ్ల పోలమ్మ, ఎండ్ల వెంకటమ్మ, మహిళాలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలను కార్యకర్త షకీలా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలసి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా విజయ తదితరులున్నారు.

పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆదిఆంధ్ర పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ నాయకుడు తాడిపత్రి పెంచలయ్య, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, ఉపాధ్యాయులు, లక్కు కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని అనంతలక్ష్మి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయినిలు అనంతలక్ష్మి, లక్ష్మీ కుమారి, వినోద్‌ను ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : అనుముసముద్రం పేట పంచాయతీలోని గండువారిపల్లి సమీపంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రుక్సానా బేగం, కె.శైలజ, డివి భార్గవి, తదితర ఉపాధ్యాయినులను సన్మానించారు.

**ప్రజాశక్తి-విడవలూరు** : మండల పరిధిలోని పిఆర్‌ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-బిట్రగుంట** : సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా విశ్వనాథరావుపేటలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. బాలుర స్కూల్లో అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు బాల శైలజ ఆధ్వర్యంలో, బాలికల స్కూల్లో రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మెతుకు రాజేశ్వరీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ ఠాగూర్, గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కందుకూరు** : అణగారిన వర్గాల ఆశాజ్యోతి భారత తొలి ఉపాధ్యాయిని చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. స్థానిక లాయర్ ఆఫీసులో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో గాండ్ల హరి ప్రసాద్, ముప్పవరపు కిషోర్, పోకూరి కోటయ్య, షేక్ రహీం, తదితరులున్నారు.

**ప్రజాశక్తి-కందుకూరు** : కందుకూరు టిఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో శుక్రవారం మహిళా సాధికారిత విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళాఉపాధ్యాయ దినోత్సవాన్ని జరిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి రాజగోపాల్ బాబు ప్రసంగించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పద్మావతి, ఫిజికల్ డైరెక్టర్ కరుణ రత్నకుమార్, అధ్యాపకులు రామకృష్ణ, బాలు నాయక్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఉలవపాడు** : ఉలవపాడులో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయిపూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఎంపియు.పి పాఠశాలలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీ టీచర్ సిహెచ్ ఇంద్రావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి గురజాల. ప్రసాదరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి దార్ల కోటేశ్వరరావు, మాల మహానాడు నాయకులు దాసరి శివాజీ, పాస్టర్ జలదంకి. జోసెఫ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ బాజీ, సూపర్వైజర్లు నాగలక్ష్మి ,అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు** : సాంఘిక సమానత్వం కోసం సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని వైసిపి నాయకులు ఎంబేటీ సంధ్యరాణి పేర్కొన్నారు. సావిత్రి బాయి జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఇస్కపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్స వం అత్యంత ఘనంగా జరిగింది. హెచ్ ఎం ఎం. శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో సం ధ్య రాణి ముఖ్య అతిధిగా, జెడ్పి టిసి శేషమ్మ, మాజీ జె డ్పిటీసి మ న్నెం చిరంజీవి గౌడ్ అతిదులుగా పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-బిట్రగుంట** : కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయిపూలే జన్మదినాన్ని పురస్కరించు కొని బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు అపోలో హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ పి.స్రవంతి పాల్గొని మాట్లాడారు. ఎఒ ఆర్‌వి రమణారెడ్డి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.